క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

వట్‌పల్లి(అందోల్): ప్రభుత్వం పేదలకు అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంలాంటిదని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో అందోల్ మండలానికి చెందిన 16 మంది లబ్ధిదారులకు చెందిన రూ.4.55లక్షల విలువైన చెక్కులు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, సర్పంచ్ యాదాగౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎంతో మంది పేదలకు నాణ్యమైన వైద్యం అందించి ఆదుకుంటున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో కోట్లాది రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు లబ్ధిదారులకు అందించామన్నారు.

నియోజకవర్గ మహిళాధ్యక్షురాలిగా వినయ పాటిల్ ఏకగ్రీవం

జహీరాబాద్ టౌన్: వీరశైవ లింగాయత్ ఉద్యోగుల సంఘం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలుగా వినయపాటిల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని బసవ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం సంఘం సమావేశం జరిగింది. ఈ మేరకు మహిళా సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షురాలిగా ఎస్.మాధవి, ప్రధాన కార్యదర్శి స్నేహ కౌలాస్, ఉపాధ్యక్షులుగా స్వప్న, హేమలత, అన్నపూర్ణ, జగదేవి, కార్యదర్శులుగా విజయలక్ష్మి, ప్రసన్న, పి. విజయలక్ష్మి, నిర్మల, సునీత, అనిత, సంగీత, అర్చన, శైలజను ఎన్నుకున్నారు. సమావేశంలో వీరశైవలింగాయత్ ఉద్యోగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్‌శెట్టి, బస్వరాజ్, చంద్రశేఖర్, శాంతకుమార్, దత్తాత్రి, సుభాష్‌లు పాల్గొన్నారు. తమకు అప్పగించిన బాధ్యతలు నిస్వార్థంగా నిర్వహిస్తామని నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు.

కేఎస్‌జీ యువసేన వార్షికోత్సవం

జిన్నారం(పటాన్‌చెరు): కేఎస్‌జీ యువసేన ఆరో వార్షికోత్సవం ఆయా గ్రామాల్లో యువకులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు కాటా సుధారాణి ఆధ్వర్యంలో కేక్ కట్ చేయించారు. కేఎస్‌జీ యువసేన ఆధ్వర్యంలో ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించాలని యువకులకు కాటా సుధారాణి సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల యువజన నాయకులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రాంతీర్థ్ గ్రామస్తురాలు బుచ్చమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె అంత్యక్రియలకు బీఎస్పీ జహీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి సిద్దు రావణ్ హాజరై, ఆర్థిక సాయం మృతురాలి కుటుంబసభ్యులకు అందజేశారు.

లాకౌట్ ఎత్తేయాలి



మాట్లాడుతున్న నర్సింహ్మా రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): నిబంధనలకు విరుద్ధంగా హార్టెక్స్ పరిశ్రమ యాజమాన్యం లాకౌట్ చేయడం సరికాదని, దానిని ఎత్తేయాలని కార్మికుల హక్కులు కాపాడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని బొల్లారం పారిశ్రామిక వాడలో ఉన్న హార్టెక్స్ రబ్బర్ పరిశ్రమ కార్మికులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ, కార్మిక హక్కులు కాపాడేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వికసించిన బ్రహ్మ కమలం



న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలో నివసించే రాంచందర్ పవర్ ఇంటి ఆవరణలో గురువారం రాత్రి 10 గంటల సమయంలో బ్రహ్మ కమలం వికసించింది. ఇంటి వారితోపాటు ఇరుగు పొరుగు పెద్ద ఎత్తున తరలొచ్చారు. తొలి ఏకాదశి కావడంతో మహిళలు బ్రహ్మ కమలానికి పూజలు నిర్వహించారు. బ్రహ్మ కమలం చెట్లు అరుదుగా కనిపిస్తాయి.

అమీన్‌పూర్‌లోనే పాలిటెక్నిక్ కళాశాల

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: సీఎం కేసీఆర్ ఇటీవల ప్రకటించిన పాలిటెక్నిక్ కళాశాల అమీన్‌పూర్‌లోనే ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి వెల్లడించారు. సీఎం కేసీఆర్ కృషితోనే వెనుకబడిన వర్గాలకు ఆత్మ గౌరవ భవనాలు సాధ్యం కావడంతో పాటు, కనుమరుగవుతున్న కులాలకు జీవం కల్పించారన్నారు. నియోజకవర్గంలో వడ్డెర కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ మంజీరానగర్‌లో ఏర్పాటు చేసిన వడ్డెర యూత్ అసోసియేషన్ నూతన కార్యాలయం భవనం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటిసారిగా రాష్ట్ర రాజధానిలో అన్ని కులాలకూ కోట్ల రూపాయలతో ఆత్మ గౌరవ భవనాలను నిర్మిస్తున్నామన్నారు. హైదరాబాద్ ఉప్పల్ భగాయత్‌లో కోట్ల విలువ చేసే ఎకరా స్థలంలో వడ్డెర ఆత్మ గౌరవ భవనాన్ని నిర్మించబోతున్నారని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో వడ్డెరలకు తగు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. వడ్డెర కులస్తుల విజ్ఞప్తి మేరకు త్వరలోనే మినీ ఫంక్షన్ హాల్ నిర్మిస్తామని హామీనిచ్చారు. సబ్బండ వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లోనూ నిండు మనస్సుతో ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహ్మాగౌడ్, కౌన్సిలర్‌లు మల్లేష్, సీనియర్ నాయకులు ప్రమోద్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, యూనుస్, చంద్రశేఖర్, దాసు, రాములు, జగదీష్, కాలప్ప, వడ్డెర సంఘం ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

శ్మశాన స్థల కేటాయింపుపై హర్షం

పటాన్‌చెరు: మండల పరిధిలోని ఐనోల్‌లో క్రైస్తవ శ్మశాన వాటిక ఏర్పాటుకు 5 ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించినందుకు పటాన్‌చెరు పాస్టర్ల సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఆసంఘం ప్రతినిధి బృందం శుక్రవారం స్థలం పరిశీలించింది. కొన్నేళ్లుగా శ్మశాన వాటిక సమస్య అపరిష్కృతంగా ఉందని, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి ఆ స్థలం కేటాయింపునకు కృషి చేశారని పాస్టర్ల సంఘం ప్రతినిధి పాస్టర్ ప్రభు వివరించారు. కాగా క్రైస్తవుల తరపున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్ పాలనలో జోరుగా అభివృద్ధి

ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి



కల్హేర్: పంచాయతీ భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రాంరెడ్డిపేటలో రూ. 20 లక్షలతో గ్రామపంచాయతీ భవనం నిర్మాణ పనులు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామంలో సీసీ రోడ్లు, బీసీ, ఎస్సీ కమ్యూనిటీ భవనాలు నిర్మించామన్నారు. విద్య, వైద్యం కోసం ప్రభుత్వం పెద్దపీట వేసిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పుట్టి దుర్గమ్మ, ఎంపీటీసీ మన్నే కృష్ణా, పీఏసీఎస్ చైర్మన్ సంగారెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఈశ్వర్, జనర్ధన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి విఠల్, నాయకులు మౌలన పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి

నారాయణఖేడ్: అన్నివర్గాల సంక్షేమంతోపాటు ప్రాంత సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి తెలిపారు. నారాయణఖేడ్ నుంచి సిర్గాపూర్ మీదుగా మాసాన్‌పల్లికి రూ.15 కోట్లతో చేపట్టిన డబుల్‌లైన్ రోడ్డు పనులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రహదారుల అభివృద్ధితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. తర్వాత మండలంలోని వెంకటాపూర్ చౌరస్తా సమీపంలో బ్రాహ్మణ ఆత్మగౌరవ భవనానికి భూమిపూజ చేశారు. అనంతరం మనూరు మండలం వల్లూరుకు చెందిన వార్డు సభ్యుడు చాకలి నర్సింహులుతో పాటు సుమారు 200 మంది ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లోకి చేరారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా కంగ్టికి చెందిన శిల్పకు, కృష్ణాపూర్‌కు చెందిన బాలయ్యకు, ఖేడ్‌కు చెందిన లక్ష్మికి, మేఘ్యానాయక్ తండాకు చెందిన లక్ష్మీబాయికి, గోసాయిపల్లికి చెందిన కవితకు, జెమ్లాతండాకు చెందిన కమల్‌నాయక్‌కు, కొత్తపేటకు చెందిన కృష్ణకౌశిక్‌కు, సిర్గాపూర్‌కు చెందిన విజయకు, గోందెగామకు చెందిన బాబురావుకు చెక్కులు అందజేశారు.

గ్రామపంచాయతీకి ఫర్నిచర్ ఇప్పించాలి

జిన్నారం(పటాన్‌చెరు): జంగంపేట సర్పంచ్ వెంకటయ్య, ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశంగౌడ్‌లతోపాటు స్థానిక నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని కలిశారు. గ్రామపంచాయతీ(జీపీ) భవనం పూర్తయిందని, ఫర్నిచర్‌ను ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరారు. దీనికి ఎమ్మెల్యే, త్వరలోనే ఫర్నిచర్ ఇప్పిస్తానన్నారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు శంకరప్ప పాల్గొన్నారు.

కుటుంబపాలన అంతమే తెలంగాణ రాష్ట్రానికి మోక్షం

హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

సదాశివపేట(సంగారెడ్డి): తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ కుటుంబపాలనలో బందీ అయ్యిందని, ఆ కుటుంబపాలన పోతేనే తెలంగాణ ప్రజలకు, రాష్ట్రానికి మోక్షం లభిస్తుందని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం సదాశివపేటలో తొమ్మిదేళ్ల ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సుపరిపాలన మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర బీజేపీ నాయకుడు శివరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని, ప్రపంచ దేశాలకు మన దేశాన్ని రోల్ మోడల్‌గా నిలిపారన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులు దారిమళ్లించి సీఎం కేసీఆర్ తన పబ్బం గడుపుతున్నారని ఆరోపించారు. దళిత బంధు అర్హులకు అందడంలేదన్నారు. లక్ష ఆర్థిక సాయానికి దరఖాస్తు దారులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగి అలసిపోయారన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్లు 25 లక్షలు నిర్మిస్తామని ప్రకటించి వందల్లో నిర్మించారన్నారు. మహారాష్ట్రకు 600 వందల కార్లతో వెళ్లడం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, బీజేపీరాష్ట్ర నాయకుడు శివరాజ్‌పాటిల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజేశ్వర్‌దేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు ఓ మోసం



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, రైతులు

జిన్నారం(పటాన్‌చెరు): రైతుబంధు పేరిట ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని, బ్యాంకుల్లో జమ చేసిన నగదును బ్యాంకు అధికారులు వారికి తెలియకుండానే వడ్డీల పేరుతో తీసుకుంటున్నారని ఎంపీపీ రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ ఆరోపించారు. రైతుబంధు నగదును బ్యాంకు అధికారులు తీసుకోవటాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం ఏపీజీవీ బ్యాంకు ముందు కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా చేపట్టారు. తొలుత పార్టీ కార్యాలయం నుంచి బ్యాంకు వరకు ర్యాలీగా వచ్చారు. అనంతరం రవీందర్‌గౌడ్, వడ్డె కృష్ణ మాట్లాడుతూ, రైతులకు పెట్టుబడి సాయం లేకుండా పోతోందన్నారు. పంట పెట్టుబడి సాయంకు బ్యాంకు అధికారులు ప్రోత్సహించటం లేదన్నారు. ముందుగా బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పార్టీ మాజీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గంగు రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

గ్రూప్–4 పరీక్షకు అంతా సిద్ధం



పరీక్ష కేంద్రంలో ఆర్డీఓ, సీఐ తదితరులు

జహీరాబాద్: గ్రూప్–4 పరీక్షల నిర్వహణకు గాను జహీరాబాద్‌లోని 9 పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. శుక్రవారం వీటిని ఆర్డీఓ వెంకారెడ్డి, సీఐ భిక్షపతి, ఎస్ఐ. శ్రీకాంత్, తహసీల్దార్ స్వామి సందర్శించారు. జహీరాబాద్ మండలం హోతి(కె)లో గల గురుకుల పాఠశాల, జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, తపస్య జూనియర్ కళాశాల, నవ చైతన్య జూనియర్ కళాశాల, గాయత్రి జూనియర్ కళాశాల, ఆర్ఎల్ఆర్ జూనియర్ కళాశాల, స్రవంతి జూనియర్ కళాశాల, షాహీన్ గ్రూప్ విద్యాసంస్థ, రంజోల్‌లోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలల్లో ఈ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

స్పీడ్ బ్రేకర్లు తొలగించాలి

కర్దనూర్ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుపై..
: సీఐటీయూ



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

పటాన్‌చెరు టౌన్: ప్రమాదాలకు నిలయమైన ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్ పై ఉన్న స్పీడ్ బ్రేకర్లను వెంటనే తొలగించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు పాండురంగారెడ్డి, జిల్లా కోశాధికారి నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ముత్తంగి నుంచి కర్దనూర్ వెళ్లే ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుపై శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పాండురంగ రెడ్డి, నరసింహారెడ్డి మాట్లాడుతూ, ముత్తంగి స్వీట్ హార్ట్ హోటల్ జాతీయ రహదారి నుంచి కర్దనూరు వెళ్లే ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుపై రోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయన్నారు. ఈ రోడ్డు వెంట భారీ స్పీడ్ బ్రేకర్స్ వేయడంతో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారని చెప్పారు. స్పీడ్ బ్రేకర్ల వద్ద రేడియం పెయింట్స్ కానీ, స్పీడ్ బ్రేకర్స్ ఉన్నట్టు సూచికంగా ఎలాంటి బోర్డులూ ఏర్పాటు చేయలేదన్నారు.

మెరుగైన ఆర్టీసీ సేవలకు కృషి



మాట్లాడుతున్న డీఎం మల్లేశయ్య

నారాయణఖేడ్: ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సేవలకు కృషి చేస్తానని ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. శుక్రవారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం నిర్వహించారు. నాగ్ధర్‌కు చెందిన రాములు చిస్తి వట్‌పల్లి, సదాశివపేటలకు బస్సులు నడపాలని కోరారు. ఖేడ్‌కు చెందిన వి.నరేందర్ మాట్లాడుతూ మహారాష్ట్రలోని నాందేడ్‌కు బస్సు పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. బీదర్‌కు సమయానుకూలంగా బస్సులు నడపాలని, జర్నీ నర్సింహ్మాస్వామి ఆలయం మీదుగా బస్సులు నడిపించాలన్నారు. సంజీవన్‌రావుపేట్‌కు చెందిన రమేశ్ సంజీవన్‌రావుపేట్, నాగ్ధర్, నిజాంసాగర్, కద్పల్, పిట్లంలకు బస్సులు నడపాలన్నారు. పెద్దశంకరంపేట నుంచి ఖేడ్ ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలకు బస్సు నడపాలని పేటకు చెందిన రాములు, కల్హేర్ మీదుగా నిజాంసాగర్‌కు బస్సు నడపాలని కల్హేర్‌వాసి అశోక్ విజ్ఞప్తి చేశారు. దీనిపై డీఎం, త్వరలోనే ఆయా సమస్యలు పరిష్కరిస్తానన్నారు.

సంగారెడ్డి టౌన్: డయల్ యువర్ డీఎంను శుక్రవారం డిపో మేనేజర్ ఉపేందర్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి మీదుగా సదాశివపేట జహీరాబాద్‌కు వచ్చే బస్సులలో కొన్నింటిని సంగారెడ్డి బైపాస్ మీదుగా నడపాలని, సదాశివపేట నుంచి కంకోల్ మీదుగా నారాయణఖేడ్‌కు బస్సులను పెంచాలని సదాశివపేట వాసి నర్సింలు కోరారు. సంగారెడ్డి నుంచి కానుకుంటకు బస్సులను నడపాలని సంగారెడ్డి వాసి బుధయ్య విజ్ఞప్తి చేశారు. సదాశివపేట నుంచి సింగూర్‌కు ఉదయం వేళలో బస్సులు నడపాలని సింగూర్ నుంచి శ్రీనివాస్ తెలిపారు. శంకర్‌పల్లి రూట్లలో బస్సులను పెంచాలని ఎద్దు మైలారం వాసి వీరయ్య , అన్ని ఆర్టీసీ బస్సులను బీరంగూడ కమాన్ వద్ద నిలిపేలా చూడాలని బీరంగూడ నుంచి అనంతరాములు కోరారు. దీనిపై డీఎం, తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు.

రుక్మిణీ పాండురంగ స్వామికి పల్లకిసేవ

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని శ్రీ రుక్మిణి పాండురంగ సహిత ఉమామహేశ్వర మందిరంలో ఆషాఢ తొలి ఏకాదశి ఉత్సవాలు నిర్వహించారు. శుక్రవారం పలు విశేష కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి పల్లకి సేవ ఊరేగింపు కన్నుల పండగల జరిగింది. ఆలయం నుంచి ప్రారంభమైన పల్లకి ఊరేగింపు మాణిక్‌ప్రభు వీధి నంచి ప్రధాన రహదారి వరకు కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులు భజనలు చేస్తూ కీర్తనలు ఆలపించారు. అంతకు ముందు మహిళలు సామూహిక విష్ణు సహస్రనామాలు, భగవద్గీత శ్లోకాల పారాయణం చేశారు. స్వామికి ప్రత్యేక పూజలు, మహా హారతి తరువాత భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ బీఆర్ఎస్‌లోకి చేరికలు

రాయికోడ్(అందోల్): మండలంలోని పాంపాడ్‌కు చెందిన పలు పార్టీల నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ పాంపాడ్ సీనియర్ నాయకుడు సంగమేశ్వర్ పాటిల్, అబ్దుల్ రజాక్, మధుసుదన్‌రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ సమక్షంలో పార్టీలో చేరారు. బీఆర్ఎస్‌లో చేరిన గ్రామానికి చెందిన ఎం.ఏసుదాసు, బి.భూమయ్య, జి.ప్రవీణ్‌కుమార్, కే.నర్సింలు, ఏ.డానియల్‌లకు ఎమ్మెల్యే పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు.

◆ అధిక దిగుబడులు సాధించాలి

సంగారెడ్డి టౌన్ : రైతులు నాణ్యమైన విత్తనాలను పొంది అధిక దిగుబడిని సాధించాలని జిల్లా సహకార సంఘాల అధికారి తుమ్మ ప్రసాద్ అన్నారు. సహకార సంఘాల నాయకులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అయన ప్రసంగిస్తూ, మల్టీస్టేట్ సహకార విత్తన సంఘాల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం లక్ష్యంగా ఏర్పాటు చేస్తోందన్నారు. సేకరణ, ప్రాసెసింగ్, గ్రాండింగ్, లేబుల్, ప్యాకేజీ గోదాంలలో నిల్వ, శుద్ధి చేయబడిన విత్తన సరఫరా ప్రయోగాత్మకంగా అభివృద్ధి పరచడానికి సహకార సమృద్ధి ఉంటుందన్నారు.

◆ నేడు శనిత్రయోదశి పూజలు

పటాన్‌చెరు టౌన్: పట్టణం టోల్ గేట్ సమీపంలోని మంజీరా క్యాంపస్‌లో ఉన్న శ్రీరామలింగేశ్వర దేవస్థానంలో శని త్రయోదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు మహేష్ తెలిపారు. శనివారం ఉదయం 5.30 నుంచి 11 గంటల వరకు శనీశ్వరస్వామికి భక్తులతో తైలాభిషేకం, శివాభిషేకం నిర్వహిస్తామన్నారు.

◆ చదువుతోపాటు ఆటల్లో రాణించాలి

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సెయింట్ జోసెఫ్ స్కూల్ స్టేట్ సిలబస్ నుంచి సీబీఎస్ఈకి అప్ గ్రేడ్ కాగా ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఫాదర్ శాంతూ రాజా, ప్రిన్సిపాల్ జోసఫ్ బాబు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

◆ డ్రంకెన్ డ్రైవ్‌లో 12 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. బుధ, గురువారాల్లో డ్రంకెన్ డ్రైవ్‌లో 12 మందిని పట్టుకున్నారు. శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా జడ్జి 12 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి పేర్కొన్నారు.

◆ ఉద్యోగ విరమణ సహజం

జహీరాబాద్ టౌన్ డిపోలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్–3 బాలరాజ్, ఏడీసీ ఆనందర్, కండక్టర్ అమృత్, డ్రైవర్ ఎంవీ రెడ్డి పదవీ విరమణ చేయగా ఆర్టీసీ డీఎం రజనీ కృష్ణ శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో అధికారులు చంద్రకళ, కార్మికుల నాయకులు మాణిక్, రాజు స్వామి, బొంతప్ప, మోహీన్ పాల్గొన్నారు.

◆ ఉద్యమకారుడి కుటుంబానికి పరామర్శ



హత్నూర (సంగారెడ్డి): మండలంలోని దౌల్తాబాద్ వార్డు సభ్యుడు ఎండీ గౌస్ తండ్రి, ఉద్యమ నాయకుడు చనిపోయారని తెలుసుకొని వారి కుటుంబాన్ని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి శుక్రవారం రాత్రి పరామర్శించారు. ఆమె వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, ఎంపీపీ వాయిలాల నరసింహులు, ఎంపీటీసీ ఇంద్ర సతీష్, యువత అధ్యక్షుడు కిషోర్, పట్టణ అధ్యక్షుడు అజ్జు, సీనియర్ నాయకుడు ఇబ్రహీం, వార్డు సభ్యులు ఆసిఫ్, మండల నాయకులు తదితరులు ఉన్నారు.

◆ దేశ రాజకీయాల్లో దిక్సూచి బీఆర్ఎస్

పటాన్‌చెరు: ముఖ్యమంత్రి కేసీఆర్ బీఆర్ఎస్‌తో దేశ రాజకీయాల్లో పెనుమార్పులు తీసుకొస్తున్నారని, అది దిక్సూచిలా నిలిచేలా కృషి చేస్తున్నారని పార్టీ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం మండలం చిట్కుల్‌లోని ఆదర్శ కాలనీలో తుల్జా అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

◆ కాంగ్రెస్‌లోకి పలువురు చేరిక

నారాయణఖేడ్: మాజీ ఎంపీ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సురేశ్ షెట్కార్ స్వగృహంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, ఖేడ్ నాయకులు సాగర్ షెట్కార్ ఆధ్వర్యంలో శుక్రవారం మనూరు మండలం బోరంచకు చెందిన పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరారు. చేరిన వారిలో యువకులు సురేష్, సుమన్ తదితరులు ఉన్నారు.

◆ సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్పనగేష్ తెలిపారు. శుక్రవారం మల్లికార్జున్‌నగర్ కాలనీలో పార్కు ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రఘురాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ తోపుడు బండ్ల పంపిణీ

జహీరాబాద్: స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎనిమిందికి ఉచితంగా తోపుడు బండ్లు పంపిణీ చేశారు. పేదలు కూరగాయలు అమ్ముకుని జీవనం సాగించేందుకు వీలుగా తోపుడు ఉచితంగా బండ్లు పంపిణీ చేస్తున్నట్లు రోటరీ సభ్యులు పేర్కొన్నారు. డాక్టర్ సీతారామరాజు, ఎన్.లాల్‌రెడ్డి, సంగ్రాం పాటిల్, సి.వెంకటేశం, బి.జగదీశ్వర్, సి.రమేష్, బి.శ్రీనివాస్ స్వచ్ఛందంగా ముందుకొచ్చి తోపుడు బండ్లకు ఆర్థిక సాయం చేశారన్నారు.